క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్ తనిఖీ

రొంపిచెర్ల: రొంపిచెర్ల పోలీస్‌స్టేషన్‌ను చిత్తూరు డీఎస్పీ సురేంద్రరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సమస్యపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ప్రతిఒక్కరికి పోలీసులు న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నిఘా పెట్టాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కల్లూరు సీఐ సూర్యనారాయణ, ఎస్‌ఐ సుబ్బారెడ్డి, ఏఎస్‌ఐ మధు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి జట్ల ఎంపిక



హైజంప్‌లో పోటీ పడుతున్న క్రీడాకారులు

సదుం: మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం జిల్లా స్థాయి పాఠశాల క్రీడా జట్ల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, లాంగ్‌జంప్, హైజంప్ క్రీడల్లో సీనియర్, జూనియర్ విభాగాల్లో జట్లను ఎంపిక చేసినట్లు ఎంఈఓ–2 దామోదర తెలిపారు. ఎంపికైన జట్లు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటాయని చెప్పారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ఐకమత్యంతో పోరాటం

పుంగనూరు: మండలంలోని ఎస్సీ, ఎస్టీలు, ఎంఆర్‌పీఎస్ కలసి పోరాటం చేసి సమస్యలు పరిష్కరించుకోనున్నట్లు నేతలు స్పష్టం చేశారు. బుధవారం సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ కమిటీ ఎంఆర్‌పీ కలసి సమస్యలపై ఉద్యమించాలని నిర్ణయించుకున్నారు. ఐకమత్యంతో సమస్యలు సాధించుకోవాలని తీర్మానించుకున్నారు. నేతలు నాగరాజ, వెంకట్రమణ, బాలాజీ, పవిత్ర, శ్రీనివాసులు, రాజు, చిన్నప్ప, నాగభూషణ, లక్ష్మన్న, నరసింహులు పాల్గొన్నారు.

మదర్‌థెరిసాకు పతకాల పంట



ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకున్న మదర్ థెరిసా విద్యార్థులు

పెద్దపంజాణి: కర్నూలు పట్టణంలో ఆదివారం జరిగిన అంతర్రాష్ట్ర కరాటే పోటీల్లో మండలంలోని లింగాపురం మదర్‌థెరిసా పాఠశాలకు చెందిన 66 మంది విద్యార్థులు కటా, కుమతే విభాగాల్లో పాల్గొన్నారని పాఠశాల చైర్మన్ డా.రవీంద్రబాబు తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు 17బంగారు, 20 రజత, 29 కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపల్ డేవిడ్, కరాటే మాస్టర్ డి.సదాశివ విద్యార్థులను అభినందించారు.

చిత్తూరులో సర్కిల్ కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్‌శాఖ నూతన సర్కిల్(జిల్లా) కార్యాలయం చిత్తూరులో పెట్టడానికి ఆమోదం తెలుపుతూ బుధవారం సీఎండీ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. శాఖపై ఆర్థిక ఇబ్బందులు రాకుండా ఉండే ఉద్యోగులతో విభజన చేయనున్నట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు.

స్కూలు దూరం.. చదువు భారం





కొత్తపల్లె నుంచి కేసీ పెంటకు వెళ్లే దారి, స్కూల్‌కు స్వస్తి పలికి మేకలు మేపడానికి వెళుతున్న బాలిక

- రోజూ నాలుగు కి.మీ నడిచి బడికి విద్యార్థులు
- పాల ఆటోలు వెళ్లిపోతే కాలినడకే దిక్కు
- ఇదీ కలిమిచెట్లపెంట విద్యార్థుల కష్టం
- ఎర్రబస్సు కోసం ఎదురుచూపులు

పలమనేరు: ప్రతిఒక్కరూ చదువుకోవాలని ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. కనీసం ఓ విద్యార్థి బడి మానేసినా వెంటనే వారి తల్లిదండ్రుల వద్దకెళ్లి విద్య ఆవశ్యకతను వివరించి తిరిగి ఆ విద్యార్థిని పాఠశాలకు ఉపాధ్యాయులు తీసుకొస్తున్నారు. అయితే పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలంలోని అటవీప్రాంత గ్రామమైన కలిమిచెట్లపెంట విద్యార్థులు రోజూ నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లి చదుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎందుకంటే ఆ గ్రామానికి ఎర్రబస్సు కాదు కనీసం ఆటోలు కూడా వెళ్లవు. పూర్తిగా అడవిలో ఈ మార్గం ఉంది. తరచూ వచ్చే పాల ఆటోలు మినహా మరో దిక్కులేదు. ముఖ్యంగా బాలికలు ఆ గ్రామం నుంచి కొత్తపల్లి హైస్కూల్‌కు రావడం కష్టతరంగా మారింది. దీంతో పలువురు తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు ఆపేసి మేకలు మేపడానికి పంపుతున్నారు.

అభివృద్ధికి నోచుకోని గ్రామం

గంగవరం మండలంలోని అడవిలో మధ్యలోగల ఈ గ్రామంలో 40కి పైగా కుటుంబాలున్నాయి. ఎక్కువ మంది నిరక్షరాస్యులే. వీరు వ్యవసాయ కూలీలగానూ, అడవిని నమ్ముకొనే జీవనం సాగిస్తున్నారు. అయితే ఇదే గ్రామంలోని కొందరు ఉన్నత చదువులు చదివి బయట ఉద్యోగాల్లో ఉన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని పలువురు పిల్లలు చదువుకోవాలనే ఆసక్తిని పెంచుకున్నారు. ఆ గ్రామంలో ఓ ఎలిమెంట్రీ పాఠశాల ఉంది. రోజూ టీచర్లు బైక్‌లో అతికష్టంపై అక్కడికెళ్లి పాఠాలు చెప్పి వస్తున్నారు. ఆ గ్రామం నుంచి విద్యార్థులు హైస్కూల్‌కు రావాలంటే కొత్తపల్లెకు రావాల్సిందే. అటవీ మార్గంలో ఉదయం నాలుగు కిలోమీటర్లు నడిచొచ్చి, సాయంత్రం తిరిగి నడిచి వెళ్లాల్సిందే. అయితే ఆ గ్రామానికి సీసీ రోడ్డు ఉన్నప్పటికీ ఆటో సౌకర్యం కూడా లేదు. దీంతో కాలినడకే శరణ్యంగా మారింది.

చదువుకోవడానికి విద్యార్థులకు ఇబ్బందులే

కేసీ పెంట నుంచి ఉన్నత పాఠశాలకు వచ్చే పలువురు విద్యార్థులు రోజూ ఎనిమిది గంటలకే టిఫిన్ బాక్సులతో గ్రామం నుంచి కాలినడకన బయల్దేరి కొత్తపల్లె హైస్కూల్‌కు చేరుకుంటారు. తిరిగి పాఠశాల ముగియగానే రాత్రి ఏడు గంటలకు ఇళ్లకు వెళుతున్నారు. వీరిలో పదో తరగతి చదివే అమ్మాయిలు సైతం ఉన్నారు. వర్షాకాలంలో అయితే విద్యార్థుల ఇబ్బందులు చెప్పనవసరం లేదు. చదువుకోవడానికి ఈ పిల్లలు పడుతున్న కష్టం చూస్తుంటే ఎవరికైనా అయ్యో అనిపించక తప్పదు. ఇక ఆ గ్రామం నుంచి పలమనేరులోని కళాశాలలకు రావాలంటే పాల ఆటోలు లేదా కుటుంబీకులు కొత్తపల్లిదాకా ద్విచక్రవాహనాల్లో దింపాల్సి ఉంటుంది. ఇలాంటి అటవీప్రాంత గ్రామాలకు రవాణ సౌకర్యాలు లేక పలువురు విద్యార్థులు మధ్యలోనే చదువుకు స్వస్తి పలికాల్సి వస్తోంది. ఈ గ్రామానికి కనీసం స్కూల్, కళాశాల పిల్లల కోసమైనా ఆర్టీసీ అధికారులు స్పందించి విద్యార్థుల కోసం బస్సును నడపాల్సిన అవసరం ఎంతైనా ఉందని అక్కడి గ్రామస్తులు విన్నవిస్తున్నారు.

వరుణుడు రాడాయె.. పంట ఎండిపాయె..!



వర్షాలు లేక ఎండిన వేరుశనగ పంట

కుప్పం: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగానే గత ప్రభుత్వం రైతు భరోసా పథకంగా ప్రతి రైతు ఖాతాలో నగదు జమ చేసేది. దీంతో ఆ సీజన్‌లో సాగు చేసే వేరుశనగతో ఆరుతడి పంటలు, వరికి పెట్టుబడిగా రైతు భరోసా ఆదుకునేది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు సంక్షేమానికి తిలోదకాలిచ్చింది. రైతు భరోసా ఇవ్వకుండా వారిని నట్టేట ముంచింది. ఈసారి వేరుశనగ పెట్టుబడికి రైతులు అప్పుల పాలయ్యారు. దీనికి తోడు వరుణ దేవుడు కనికరించకపోవడంతో వేరుశనగ ఎండిపోతోంది.

వర్షాభావ పరిస్థితులు

వర్షాభావ పరిస్థితుల కారణంగా వేరుశనగ పంట పూర్తిగా ఎండిపోయింది. ఈ ఏడాది వేరుశనగ పంటకు పూత దశ నుంచే వర్షాలు కురవలేదు. వర్షాలు వస్తాయని ఆశతో ఎదురుచూస్తున్న రైతాంగానికి నిరాశే మిగిలింది. నియోజకవర్గంలోని కుప్పం, గుడుపల్లె మండలాల్లో మిట్ట ప్రాంతం అధికంగా ఉండడంతో రైతులు ఆరుతడి పంటలపై మొగ్గుచూపారు. వేరుశనగ, అనప, కందులు, పెసల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రధానంగా వేరుశనగపై రైతులు పెట్టుకున్న ఆశలు ఆడియాశలయ్యాయి. వర్షాభావంతో వేరుశనగ పూర్తిగా ఎండిపోయింది. ఈ మధ్యకాలంలో ఎప్పుడూ ఇంతగా నష్టపోలేదని పలువురు రైతులు కుమిలిపోతున్నారు.

తీరని నష్టం

రైతు భరోసా ప్రభుత్వం ఇస్తుందని నమ్మి వేరుశనగ పంటకు అప్పులు చేసి సాగు చేశారు. తీరా ప్రభుత్వం రైతు భరోసా అమలు చేయక మొండి చెయ్యి చూపింది. మరోవైపు వర్షాలు కురవక పంట ఎండుముఖం పట్టింది. కనీసం పెట్టుబడి అయినా దక్కితే చాలని చాలని ఆశపడ్డ రైతులకు నిరాశే మిగిలింది. నియోజకవర్గంలో 4,502 ఎకరాల్లో వేరుశనగ పంట ఎండిపోయిందని అధికారులు అంచనా వేస్తున్నారు. నష్టాలతో కూరుకుపోయిన ప్రభుత్వం ఆదుకోవాలని తమను ఆదుకోవాని బాధిత రైతులు కోరుతున్నారు.

ఆకట్టుకుంటున్న మహాభారతం



బలిబండిలో ఊరేగుతున్న భీమపాత్రధారి

సదుం: భట్టువారిపల్లెలో పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞం భక్తులను ఆకట్టుకుంటోంది. మధ్యాహ్నం జ్యోత్స్న హరికథా గానం, రాత్రి వెంకటేశ్వర నాట్యకళామండలి ఆధ్వర్యంలో నాటక ప్రదర్శన విశేషంగా అలరిస్తోంది. బుధవారం బలిబండి కార్యక్రమం నిర్వహించారు. భీమ పాత్రధారి బకాసురుని వధ కోసం వాహనంలో ఊరేగుతూ భక్తుల నుంచి ఆహార పదార్థాలు స్వీకరించారు. శుక్రవారం ద్రౌపదీ కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఏరియా ఆస్పత్రిలో ఫార్మసిస్ట్ డే



ఫార్మసిస్ట్ డేను నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో బుధవారం ప్రపంచ ఫార్మసిస్ట్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి వైద్యులు, సిబ్బంది కేక్‌కట్ చేసి ఫార్మసిస్ట్‌ల ప్రాముఖ్యతను వివరించారు. ఆస్పత్రి సూపరిండెంటెంట్ మమతా రాణి, చీఫ్ ఫార్మసీ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

పూడిక తీయండి మహాప్రభో!



గుంతలమయమైన గానుగచింత రోడ్డు



కాలువలో నిలిచిపోయిన మురుగునీరు

- ఎటుచూసినా రోడ్డులో గుంతలే

రొంపిచెర్ల: రోడ్లపైనే మురుగునీరు ప్రవహించి గుంతలు పడ్డా గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు. రొంపిచెర్ల గ్రామ పంచాయతీలోని గానుగచింత రోడ్డులోని వారణాసివారిపల్లె వద్ద మురుగుకాలువ పూడిపోవడంతో మురుగునీరంతా రోడ్డుపైకి వస్తోందన్నారు. దీంతో గానుగచింత రోడ్డు గుంతలమయం అయిందన్నారు. గుంతల్లో మురుగునీరు నిలిచి దోమలు అభివృద్ధి చెంది అంటువ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనరాకపోకలకు కూడా ఇబ్బందిగా ఉందన్నారు. ఇప్పటికైనా మురుగునీటి కాలువలో పూడిక తీయాలని ప్రజలు కోరుతున్నారు.

బంగాళాదుంప సాగుపై అవగాహన

వి.కోట: నేడు పట్టణంలోని దుర్గానగర్‌లోని దుర్గామాత ఫంక్షన్ హాల్‌లో ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో బంగాళదుంప పంటసాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నట్లు మండల ఉద్యానవనశాఖాధికారిణి లక్ష్మీప్రసన్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు ఉద్యానశాఖాధికారులు, శాస్త్రవేత్తలతో బంగాళాదుంప పంట సాగు, సమగ్ర సస్యరక్షణపై అవగాహన కల్పిస్తారని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె ప్రకటనలో కోరారు.

నేడు బంగాళాదుంప సాగుపై శిక్షణ

శాంతిపురం: ప్రస్తుత సీజన్‌లో అధికంగా సాగు చేసే బంగాళాదుంప పంటలో లాభసాటి దిగుబడులు పొందేందుకు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు హార్టికల్చర్ అధికారిణి డింపు ప్రియాశ్రీ తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు మండల సచివాలయ ప్రాంగణంలోని వెలుగు కార్యాలయంలో శిక్షణ ఉంటుందన్నారు. బంగాళాదుంప సాగు చేసిన, సాగుకు సిద్ధమవుతున్న రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

కరాటేలో విద్యార్థులకు బంగారు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

పుంగనూరు: పట్టణంలోని ఇంపల్స్ పాఠశాల విద్యార్థులు కరాటే పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. ప్రిన్సిపల్ సంతోష్‌కుమార్ బుధవారం మాట్లాడుతూ కర్నూల్‌లో జరిగిన ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్ పోటీల్లో పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ధన్యసాయి బంగారు పతకం మోక్షశ్రీ, తనిష్‌కుమార్‌రెడ్డి కాంస్య పతకం సాధించారని తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

వి.కోట: నేడు పట్టణంలోని జెడ్పీ బంగ్లా వద్ద లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు లయన్స్‌క్లబ్ మండల అధ్యక్షుడు ధీరజ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకురావాలని కోరారు.

తీరిన మంచి నీటి సమస్య



ఏర్పాటు చేసిన మంచినీటి బోరు

పలమనేరు: మండలంలోని మొరం పంచాయతీ రాజీవ్‌నగర్ కాలనీలో నీటి సమస్య తీరింది. ఇక్కడ గత కొన్నాళ్లుగా మంచినీటికి ఇబ్బందులుండేవి. దీనిపై అక్కడి సర్పంచ్ విశ్వనాథరెడ్డి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన అక్కడ కొత్త బోరు, మోటార్ అమర్చేందుకు జెడ్పీ నిధులను మంజూరు చేశారు. దీంతో ఇటీవల బోరు డ్రిల్ చేయగా పుష్కలంగా నీరు పడింది. గ్రామంలో మంచినీటి సమస్య తీరడంతో జెడ్పీ చైర్మన్‌కు గ్రామస్తులు కతజ్ఞతలు తెలిపారు. నేత రామన్న, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి కోనేటిరాయుని పవిత్రోత్సవాలు

గంగవరం: శ్రీకోనేటిరాయ స్వామి వార్షిక పవిత్రోత్సవాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. టీటీడీ అనుబంధ కీలపట్ల కోనేటిరాయస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి నాలుగు రోజులపాటు స్వామివారి వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు శుక్రవారం ఉదయం స్వామివారికి ఆరాధన, పుణ్యాహవచనం సాయంత్రం 6గంటలకు అంకురార్పణ ఉంటుందన్నారు. శనివారం ఉదయం పవిత్ర ప్రతిష్ఠ, సాయంత్రం కుంభారాధనలు, హోమం, ఆదివారం ఉదయం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం పవిత్రసమర్పణ, సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందన్నారు. చివరిరోజు సోమవారం ఉదయం ప్రధానహోమాలు, సాయంత్రం పూర్ణాహుతి, కుంభావాహన సేవతో స్వామివారి పవిత్రోత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులు పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులు కావాలని ఆయన ప్రకటనలో కోరారు.

స్వచ్ఛతా హీ సేవలో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనుల్లో కార్మికులు

పలమనేరు: మున్సిపాలిటీలో సాగుతున్న స్వచ్ఛతా హీ సేవలో భాగంగా మున్సిపల్ సిబ్బంది బుధవారం పట్టణంలోని నీటి సరఫరా పైపులను శుభ్రం చేసి, ట్యాంకులో క్లోరినేషన్ చేశారు. ఆపై పట్టణంలోని పలుచోట్ల పారిశుధ్య పనులు చేశారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, సంఘమిత్రల వ్యక్తిగత పరిశుభ్రతపై మెప్మా అధికారులు, మహిళా సంరక్షణ అధికారులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్, సిబ్బంది పాల్గొన్నారు.

10లీటర్ల సారా స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

సదుం: సారా తయారీ స్థావరంపై దాడి చేసినట్లు ఎస్‌ఐ షేక్షావలి తెలిపారు. బుధవారం తాటిగుంట పాలెం సమీపంలోని అటవీ ప్రాంతంలో సారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఇందిరానగర్ తాండాకు చెందిన తులసీ నాయక్ సారా తయారు చేస్తుండగా పట్టుకుని 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితున్ని రిమాండ్‌కు తరలించామన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వినియోగదారులు విన్నవించారు. బుధవారం స్థానిక ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ కార్యాలయం నందు విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రాంతాల్లో నుంచి బాధితులు విద్యుత్ సమస్యలను తెలిపారు. మొత్తం 4 సమస్యలు వచ్చాయని ఈఈ మునిచంద్ర తెలిపారు. 3 కొత్త సర్వీసులు విడుదల, ఒకటి సర్వీస్ కేటగిరి మార్పు చేయాలని వినియోగదారులు తెలిపారని ఆయన అన్నారు. సంబంధిత ధ్రువపత్రాలను జత చేయాలని ఈసందర్భంగా సూచించినట్లు ఆయన వివరించారు.

సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు



కల్లూరు మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు



పెంగరగుంటలో..

సదుం: రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని ఏడీఏ శివకుమార్ సూచించారు. చింతలవారిపల్లె, ఊటుపల్లెలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ హరిప్రసాద్ పాల్గొన్నారు.

సేంద్రియ పంటలు శ్రేయస్కరం

గంగవరం: మండలంలోని కూర్నిపల్లి, చిన్నూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారులు బుధవారం నిర్వహించారు. జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్(డీడీఏ) మధుసూదన్‌రెడ్డి పాల్గొని గ్రామాల్లోని వేరుశనగ పంటలు పరిశీలించారు. అనంతరం రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఏఓ హేమలత, పశువైద్యాధికారి కల్పన, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పుంగనూరు మండలంలో..

పుంగనూరు: వనమలదిన్నె, మేలుందొడ్డి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అబ్జర్వర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఓ టెక్నికల్ ఫయాజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ మునస్వామి, ఎంపీటీసీ సూరప్ప, టీఏలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

కల్లూరులో..

కల్లూరు(పులిచెర్ల): మండలంలోని దిగువ పోకలవారిపల్లె, గేటుకాడ బెస్తపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసులు, తేజ, లీలాప్రసాద్, గణేష్, రైతులు పాల్గొన్నారు.



సదుం: సూచనలిస్తున్న ఏడీఏ శివకుమార్

సేంద్రియ సేద్యమే మేలు

శాంతిపురం: సాగుదార్లు, వినియోగదారుల ఆరోగ్యంతో పాటు పర్యావరణాన్ని కాపాడేందుకు సేంద్రియ సేద్యమే మంచిదని జిల్లా రిసోర్స్ సెంటర్ వ్యవసాయాధికారిణి లక్ష్మీప్రసన్న అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎంకే పురం వద్ద జరిగిన రైతుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం బంతి, బొప్పాయి, సొరకాయ తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అప్పాజి పాల్గొన్నారు.

పలమనేరు మండలంలో..

పలమనేరు: మండలంలోని పెంగరగుంట, సముద్రపల్లి పంచాయతీలలో వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాలు లేక ఎండుతున్న పంటలను ఎలా కాపాడుకోవాలో రైతులకు ఏఓ సంధ్య వివరించారు. సర్పంచులు భువనేశ్వరి, తిరుమల పాల్గొన్నారు.



గంగవరం మండలంలో డీడీఏ



వనమలదిన్నెలో..



ఎంకేపురంలో..

చెరకు పంట కనుమరుగు!

- పదివేల ఎకరాల సాగు నుంచి పది ఎకరాలకు
- భారంగా మారిన బెల్లం తయారీ
- స్థానికంగా అందుబాటులో లేని షుగర్ ఫ్యాక్టరీలు
- రైతన్నకు చేదెక్కిన చెరకు సాగు

పలమనేరు: పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో చెరకు పంట సాగు కనుమరుగైంది. చెరకు సాగు చేసినా స్థానికంగా ఫ్యాక్టరీలు లేకపోవడం, గానుగ ద్వారా బెల్లం తయారు చేసుకున్నా గిట్టుబాటు కాక చెరకు సాగుపై రైతులు ఆశలు వదులుకున్నారు. దీంతో గతంలో 10 వేల ఎకరాల్లో సాగవుతున్న చెరకు పంట సాగు నేడు కేవలం పది ఎకరాలకు పడిపోయింది. ఏడాదిపాటు ఎండనక, వాననక కష్టపడి చెరకు పంటను సాగు చేసిన రైతులకు ధరలు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదు. ఫ్యాక్టరీలకు చెరకును తరలించినా లేదా బెల్లం తయారు చేసుకున్నా రైతులకు నష్టాలు తప్పడం లేదు. స్థానికంగా రైతులకు అందుబాటులో ఉన్న పుంగనూరు సమీపంలోని షుగర్ ఫ్యాక్టరీ మూతపడడంతో చెరకు రైతులకు మరింత ఇబ్బందిగా మారింది. పోనీ గానుగలు ఆడుకోవాల్సిన పరిస్థితి ఉన్నా కూలీల సమస్య నెలకొంది. చెరకుపైనే ఆశలు పెట్టుకున్న రైతులు అనవసరంగా అప్పుల పాలయ్యే పరిస్థితి ఎందుకని పంటసాగు ఆపేశారు.



పలమనేరు చెరకు తోటలు

గిట్టుబాటు లేకనే వదిలేశారు..

పొరుగు రాష్ట్రంలోని ప్రైవేటు షుగర్ ఫ్యాక్టరీలకు చెరకును తరలించినా చివర్లో లెక్కలు చూస్తే పంటకు పెట్టిన పెట్టుబడి సైతం రైతులకు మిగలడం లేదు. చెరకు విత్తనం, భూసారం, తోట చుట్టకం, ఏడాది పాటు సస్యరక్షణ ఖర్చులతో లెక్కిస్తే ఉత్త పుణ్యానికి పంట చేసి అందరికీ పంచాల్సిన దౌర్భాగ్యం నెలకొంది. అసలు చెరకుసాగు చేసినప్పటి నుంచి అయ్యే ఖర్చులను లెక్కిస్తే రైతులకు మిగిలేది అంతంతే.

భారంగా మారిన బెల్లం తయారీ

ఫ్యాక్టరీలకు చెరకు వద్దనుకునే రైతులు పోనీ బెల్లం తయారీ చేసుకుందామన్నా వాటి నిర్వహణ భారంగా మారింది. సమయానికి కూలీలు దొరక్క, విద్యుత్, వర్షాలు ఇతర కారణాలతో గానుగలు చేసేందుకు వీలు కావడం లేదు. బండి బెల్లం (760 కేజీలు) ధర రూ.30వేల దాకా పలికినా బండి బెల్లం తయారు చేసేందుకు రూ.17 వేలు ఖర్చు అవుతోంది. ఫలితంగా రైతుకు మిగిలేది అంతంత మాత్రంగానే మారింది.